సాక్షి
హైదరాబాద్ । మంగళవారం । 8 । అక్టోబర్ । 2024

బతుకమ్మ, దసరా ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేయాలి


లంగర్‌హౌస్ చెరువులో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌసర్, బాలరాజ్

లంగర్‌హౌస్: బతుకమ్మ, దసరా ఉత్సవాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వీధివీధినా పూర్తి స్థాయి ఏర్పాట్లను చేయాలని ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్ అన్నారు. బతుకమ్మ సంబరాల కోసం లంగర్‌హౌస్ హెచ్‌ఎండీఏ పార్కు, చెరువు, రాం లీలా మైదానం, త్రివేణి సంగంల వద్ద మంగళవారం పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. దసరా ఉత్సవ సమితి అధ్యక్షుడు బోగి బాలరాజ్‌తో కలిసి పర్యటించిన ఆయన అక్కడ చేయాల్సిన ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ..బతుకమ్మ వదిలే చెరువు గట్ల వద్ద సరైన ఏర్పాట్లు చేయడంతో పాటు, వీధివీధినా విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. దసరా ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి అనిల్, కోశాధికారి శ్రీనివాస్ ఉన్నారు.

పండుగలు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక


ఎంపీ ఈటల రాజేందర్‌తో దేవర శ్రీనివాస్

గోల్కొండ: తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ, దసరా వేడుకలు అద్దం పడతాయని పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ అన్నారు. మంగళవారం కార్వాన్ దర్బార్ మైసమ్మ ఆలయం వద్ద కార్వాన్ ధార్మిక సమితి ఆధ్వర్యంలో జరిగే దాండియా వేడుకలకు రావాలని కోరుతూ సోమవారం సమితి ప్రతినిధులు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. తెలంగాణ ఆడపడుచులు బతుకమ్మను ఎంతో ఇష్టంగా జరుపుకుంటారని, దేశంలో ఎక్కడ లేని విధంగా పూలను సైతం పూజించే సాంప్రదాయం తెలంగాణలోనే ఉందని అన్నారు. అదే విధంగా దసరా వేడుకలను సైతం ఇంటిల్లిపాది జరుపుకుంటారని ఆయన తెలిపారు. బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు దేవర శ్రీనివాస్, రాధాకిషన్‌యాదవ్ తదితరులున్నారు.

ఉత్సాహంగా స్వపరిపాలన దినోత్సవం


ప్రిన్సిపాల్ మాధవితో అధ్యాపకులు, విద్యార్థినులు

గోల్కొండ: స్వపరిపాలన దినోత్సవం లాంటి కార్యక్రమాలతో విద్యార్థినుల్లో ఉన్న నైపుణ్యం, పాలన దక్షత వెలికి వస్తాయని గోల్కొండ బీజేఆర్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మాధవి అన్నారు. గోల్కొండ జూనియర్ కళాశాలలో స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు అధ్యాపకులుగా మారి పాఠాలు బోధించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది నస్రీన్, ముబినా, అయూమ్, జహంగీర్ తదితరులున్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి బహుమతులు అందజేశారు.

ఆకట్టుకున్న యువ కళోత్సవం


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వాణిప్రసాద్

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, సంగీత నాటక అకాడమీల ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను పురస్కరించుకొని యువ కళోత్సవం పేరిట సోమవారం రవీంద్రభారతిలో పలు కార్యక్రమాలను నిర్వహించారు. కర్ణాటక, హిందుస్థాని కచేరి అలరించగా కె.రామాచారి శిష్యబృందం ఆలపించిన భక్తి గీతాలాపన ఆకట్టుంది. మూడురోజుల పాటు యువ కళోత్సవం కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. అంతకు ముందు వివిధ మహిళా సంఘాల ఆధ్వర్యంలో బతుకమ్మ ఆటపాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి వాణిప్రసాద్, కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ నార్త్ ఈస్ట్‌జోన్ సంచాలకులు ప్రసన్న గోగోయి, సంగీత నాటక అకాడమీ చైర్మన్ అలేఖ్య పుంజాల, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి



నాయకులు, అధికారులతో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన టోలిచౌకీ, గోల్కొండ డివిజన్లలో పర్యటించారు. ఈ సందర్భంగా గోల్కొండ బల్దియా వార్డు కార్యాలయం వద్ద అధికారులు, మజ్లిస్ నాయకులతో మాట్లాడారు. చిన్న చిన్న పనులను సైతం అధికారులు సకాలంలో పూర్తి చేయలేకపోతున్నారన్నారు. డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ మూతలను సైతం మార్చక అధికారులు తమ నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తున్నారన్నారు. అంతేకాకుండా బల్దియా వార్డు కార్యాలయంలో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఆయన వెంట బల్దియా అధికారులతో పాటు మజ్లిస్ నాయకులు హారూన్ ఫరాన్, వజీఉజ్జమా తదితరులున్నారు.

పేదలకు ఉచిత న్యాయ సహాయం


అవగాహన సదస్సుకు హాజరైన న్యాయవాదులు

నాంపల్లి: ఉచిత లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను బాజ్మ్ ఏ కేక్షాన్ లిటిరరీ అసోసియేషన్ హైదరాబాద్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం మల్లేపల్లిలోని మదీనా టవర్‌లో నిర్వహించారు. న్యాయవాదులు మహ్మద్ అసద్ అలీ, మహ్మద్ ఫైసల్, హబీబ్ హుస్సేన్ జిలానీ పర్యవేక్షణలో పేదలకు ఉచిత న్యాయ సహాయాన్ని అందించారు. డైవర్స్, ఖులా, మెయింటినెన్స్, చైల్డ్ కస్టడీ, 41 సీఆర్‌పీసీ వంటి అంశాలపై ఏర్పాటు చేసిన సదస్సులో అవగాహన కల్పించారు.

దుర్గమ్మ దర్శనం.. పులకించిన భక్తజనం


గుడిమల్కాపూర్‌లో హోమం చేస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ నాగేందర్ ముదిరాజ్ తదితరులు


గోషామహల్‌లో.. బీఆర్‌ఎస్ నాయకురాలు శాంతిదేవి


కార్వాన్ దర్బార్ మైసమ్మ ఆలయంలో దేవర శ్రీనివాస్‌కు సన్మానం


ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో.. బేగంబజార్ ఇన్‌స్పెక్టర్ విజయకుమార్, ఎగ్జిబిషన్ సొసైటీ సెక్రెటరి సురేందర్‌రెడ్డి, వంశీ తిలక్, చీఫ్ కన్వీనర్ గోవింద్‌రెడ్డి


గుడిమల్కాపూర్‌లో.. దేవర వంశీ

నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. చార్మినార్, అబిడ్స్, మెహిదీపట్నం జోన్ల పరిధిలో కొలువుదీరిన అమ్మవార్లకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అమ్మవారిని రోజుకో రూపంలో అలంకరించి భక్తులకు దర్శనం కల్పిస్తున్నారు. పలు మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.
– చార్మినార్, అబిడ్స్, మెహిదీపట్నం జోన్ల బృందం


పూజలందుకుంటున్న జమ్మిచెట్టు దుర్గమాత


మహాచండీగా మీరాలంమండి అమ్మవారు


ఉప్పుగూడలో..


ఊంజల్ సేవలో భక్తులు


రాజనర్సింహా కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..


పూజల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ ఏసీపీ శ్రీనివాస్‌రావు దంపతులు


శాకంబరిగా సంజయ్‌నగర్ నల్లపోచమ్మ


సాయిబాబా దుర్గామాత ఆలయంలో..


పూజల్లో సెట్విన్ ఎండీ వేణుగోపాల్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళ


ఇంద్రనగర్ నల్లపోచమ్మ, ముత్యాలమ్మ ఆలయంలో.. పాలెం వెంకటేష్, అనీల్‌కుమార్


దబీర్‌పురా సునార్‌గల్లీలో..


జియాగూడ చౌరస్తాలో.. మంగి కిశోర్ కుమార్, వెంకటేష్, దేవేందర్ సాగర్, హేమంత్‌రాజ్

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అధికారులు

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలోని గోల్కొండ, లంగర్‌హౌస్, నానల్‌నగర్ డివిజన్లలోని పోలింగ్ కేంద్రాలను సోమవారం బల్దియా అధికారులు పరిశీలించారు. బల్దియా అధికారి రాజేశ్వరి ఆధ్వర్యంలో బృందం వారు ఈ మూడు డివిజన్‌లలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. అధికారి రాజేశ్వరి మాట్లాడుతూ..2026లో జరిగే బల్దియా ఎన్నికలను దృష్టిలో పెట్టుకోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించామన్నారు. ఓటు వేయడానికి వచ్చే వారికి సరైన సౌకర్యాలు లేని వాటిని గుర్తించి వాటి స్థానంలో కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని ఆమె తెలిపారు. ఆమె వెంట ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ రఘు, బిల్ కలెక్టర్ మహేష్ తదితరులున్నారు.

సమస్యపై డీసీకి ఫిర్యాదు

రాజేంద్రనగర్: తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం, గ్రేవ్ యాడ్ కమిటీ రజక సంఘం ఆధ్వర్యంలో సోమవారం రాజేంద్రనగర్ సర్కిల్ ఉపకమిషనర్ రవి కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. బంగారు మైసమ్మ ఆలయ ప్రహరీ ధ్వంసమయ్యిందని, ప్రహరీ నిర్మాణానికి జీహెచ్‌ఎంసీ సహకరించాలని డీసీని కలిసి కోరినట్లు తెలిపారు. అలాగే వరదనీరు వెళ్లేందుకు కాలువను ఏర్పాటు చేయాలని విన్నవించినట్లు తెలిపారు. అందుకు ఉపకమిషనర్ సానుకూలంగా స్పదించారని వెల్లడించారు.

12న రావణ్ దహన్ వేడుకలు



జియాగూడ: ఈ నెల 12న పురానాపూల్ మూసీనది గణేష్‌ఘాట్ వద్ద 74 సిమోలంగస్ సమితి ఆధ్వర్యంలో నారాయణ్ కళ చారిటబుల్ కల్చరల్ ట్రస్ట్ ద్వారా రావణ్ దహన కార్యక్రమాన్ని భారీ ఎత్తున నిర్వహిస్తున్నట్లు సమితి అధ్యక్షుడు టి.జితేందర్ సింగ్, ఉపాధ్యక్షుడు మనోజ్ సింగ్, ఉపాధ్యక్షులు కిషన్‌సింగ్, ప్రధాన కార్యదర్శి వీరేందర్ కుమార్, కోశాధికారి సందీప్‌సింగ్ అన్నారు. సోమవారం మాజీ కార్పొరేటర్ జి.ముఖేష్ సింగ్‌ను కలిసి ఆహ్వానించి వేడుకల బ్రోచర్‌ను విడుదల చేశారు. సలహాదారులు డి.రాంసింగ్, దత్తాతివారి, ప్రశాంత్, కేమ్‌చంద్, నరేందర్ పర్షాద్ జైస్వాల్, వీరేందర్ పర్షాద్ జైస్వాల్, రాకేష్ కుమార్, అజిత్ సింగ్, రాహుల్ దుబే, రిజిని సింగ్, ధనుంజయ్‌సింగ్ పాల్గొన్నారు.

నర్సింగానంద్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి


గోల్కొండ ఏసీపీకి ఫిర్యాదు చేస్తున్న పాషాభాయ్ తదితరులు

గోల్కొండ: ముస్లిం మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసిన దాసన్‌దేవి ఆలయ పూజారి యతీ నర్సింగానంద్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ పలు ముస్లిం సంస్థల ప్రతినిధులు సోమవారం గోల్కొండ డివిజన్ ఏసీపీకి ఫిర్యాదు చేశారు. మజ్లిస్ నాయకులు, పీస్ ఫోర్స్ సొసైటీ వారు ఈ మేరకు ఏసీపీ సయ్యద్ ఫయాజ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పీస్ ఫోర్స్ సొసైటీ అధ్యక్షుడు మహ్మద్ నజీబ్ మాట్లాడుతూ.. యతీ నర్సింగానంద్‌కు భారతదేశ చరిత్ర, సంస్కృతి, సంప్రదయాలు తెలియవన్నారు. భారత చరిత్ర తెలిసి ఉంటే ఆయన ఇటువంటి ప్రకటనలు చేసే వారు కాదన్నారు. వెంట మహ్మద్ ఫహాద్ తదితరులున్నారు.


బతుకమ్మ సంబరాల్లో సీజీఎం జ్యోతి

సందడిగా బతుకమ్మ వేడుకలు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిరోజూ గుర్తు చేసుకునే పండుగ బతుకమ్మ అని టెస్కాబ్ సీజీఎం జ్యోతి అన్నారు. సోమవారం అబిడ్స్‌లోని తెలంగాణ రాష్ట్ర సహకార ఎపెక్స్ బ్యాంక్ కార్యాలయంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. అలిగిన బతుకమ్మ పేరిట నిర్వహించిన ఈ సంబరాల్లో కార్యాలయ సిబ్బంది పాల్గొని ఆటపాటలతో సందడి చేశారు.

పూలకు భలే డిమాండ్


గుడిమల్కాపూర్‌లో అమ్మకానికి బతుకమ్మ పూలు


దుర్గామాత అలంకరణకు ఉపయోగించే పూలు

గోల్కొండ: బతుకమ్మ, శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని పూల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. గుడిమల్కాపూర్‌లోని ఇంద్రారెడ్డి పూలమార్కెట్‌లో పెద్ద ఎత్తున పూల రైతులు అమ్మకాలు చేస్తున్నారు. శివారు ప్రాంతాల నుంచి బతుకమ్మ కోసం తంగెడు, గానుగ పూలు అమ్మకానికి తెస్తున్నారు. అదే విధంగా దుర్గాదేవి అలంకరణకు బంతి పూలు సైతం మార్కెట్‌కు తరలివస్తున్నాయి. బంతి పూల ధరల కంటే బతుకమ్మకు వాడే పూల ధరలు ఎక్కువగా ఉండడం గమనార్హం.

గోషామహల్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీగా మంజుల సింగ్



అబిడ్స్: గోషామహల్ జీహెచ్‌ఎంసీ–14వ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీగా మంజుల సింగ్ నియమితులయ్యారు. కొన్ని ఏళ్లపాటు ఇక్కడ పనిచేసిన సయ్యద్ సైదుద్దీన్ ఖైరతాబాద్‌కు బదిలీ కావడంతో పాతబస్తీ ఫలక్‌నూమా నుంచి మంజుల సింగ్ బదిలీపై గోషామహల్ ఏసీపీగా నియమితులయ్యారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన ఆమె మాట్లాడుతూ..14వ సర్కిల్ పరిధిలో రోడ్ల విస్తరణ కార్యక్రమానికి అధిక ప్రాధాన్యమిస్తామన్నారు. ఎవరైనా అక్రమ కట్టడాలు నిలిస్తే కఠినంగా వ్యవహరిస్తామని మంజుల సింగ్ హెచ్చరించారు.

పాతబస్తీలో సందడే..సందడి

- గుల్జార్‌హౌజ్ టు నయాపూల్ వరకు సందర్శకుల రద్దీ
- ముందుకు వెళ్లలేని వాహనాలు
- గంటల తరబడి ట్రాఫిక్ జాం



చార్మినార్: దసరా సెలవులను పురస్కరించుకుని విద్యా సంస్థలకు సెలవు రోజులు కావడంతో కుటుంబసభ్యులతో కలిసి పాతబస్తీకి తరలివస్తున్న సందర్శకులతో చార్మినార్ పరిసరాలు కళకళలాడుతున్నాయి. ప్రతిరోజూ సందర్శకులతో రోడ్లన్నీ కిక్కిరిసిపోతున్నాయి. నడకకు కూడా దారి దొరకని పరిస్థితులు నెలకొంటున్నాయి. గంటల తరబడి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. చార్మినార్ కట్టడంతో పాటు మక్కా మసీదు, లాడ్‌బజార్, చౌమహల్లా ప్యాలెస్, సాలార్‌జంగ్ మ్యూజియం తదితర పర్యాటక ప్రాంతాలన్నీ సందర్శకులతో రద్దీగా మారుతున్నాయి. దీంతో ప్రధాన రోడ్లతో పాటు అంతర్గత రోడ్లలో ట్రాఫిక్ సమస్య మరింత జఠిలమవుతోంది.

కనిపించని ఫుట్‌పాత్‌లు..

పాతబస్తీలో ఎక్కడా చూసినా ఫుట్‌పాత్‌లు కనిపించడం లేదు. గుల్జార్‌హౌజ్ నుంచి నయాపూల్ వరకు ఇంకా ఫుట్‌పాత్‌లు అందుబాటులోకి రావడం లేదు. ఈ రోడ్డులో రద్దీ సమయంలో కేవలం ఒక కిలోమీటర్ దూరానికి అర గంట సమయం పడుతుందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే ఇరుకు రోడ్లు..ఆపై ఉన్న కొద్దిపాటి ఫుట్‌పాత్‌లు కూడా కబ్జాలకు గురయ్యాయి. ఫుట్‌పాత్ ఆక్రమణలను సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో దుకాణాలు(షో రూం)ల ముందున్న ఫుట్‌పాత్‌లు మా సొంతమన్నట్లు ఆయా షో రూంల యజమానులు వ్యవహరిస్తున్నారు.

నడిరోడ్డుపై వ్యాపారాలు..

ఫుట్‌పాతులే కాదు..రోడ్లు సైతం ఆక్రమించుకొని నడిరోడ్డుపై వ్యాపారాలు కొనసాగుతుండడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. పండ్లు, గాజులు, దుస్తులు, నిత్యావసర సామగ్రి..ఒక్కటేమిటి పాతబస్తీలో సర్వమూ రోడ్లపైనే అమ్మకానికి ఉంటాయి. వాహనాల పార్కింగ్ కూడా నడిరోడ్డుపైనే!. ఫుట్‌పాత్‌లను పూర్తిగా ఆక్రమించడమే కాకుండా నడిరోడ్డుపై చిరువ్యాపారాలు కొనసాగుతున్నాయి. దీంతో పాదచారులు నడిరోడ్డుపై నడిచి వెళుతుండడంతో ఎప్పుడు ఏ వాహనం వెనుక నుంచి వచ్చి ఢీ కొడుతుందోననే భయాందోళనలో బిక్కుబిక్కుమంటూ ముందుకెళుతున్నారు.

సహకరించని వాహనదారులు...

ట్రాఫిక్ పోలీసులు అవసరమైన మేరకు ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటున్నప్పటికీ వారితో వాహనదారులు సహకరించడం లేదు. త్వరగా తమ గమ్యానికి వెళ్లాలనే తొందరలో ట్రాఫిక్ జాంలతో పాటు ప్రమాదాలకు కారణమవుతూ అప్పుడప్పుడు వాహనదారుల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. చార్మినార్ కాలిబాట పథకం పనులతో ఇప్పటికే చార్మినార్ నలువైపులా రోడ్లను మూసి వేసారు.

మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్‌లో సత్తా

- ఎంఎంఏలో గోల్డ్ మెడల్ సాధించిన పాటిల్ విగ్నేష్ యాదవ్
- పాతబస్తీ బేలాకు చెందిన పదేళ్ల కుర్రాడు
- చిన్న వయస్సులోనే 2 గోల్డ్ మెడల్స్



గోల్డ్ మెడల్ సాధించిన పాటిల్ విగ్నేష్ యాదవ్ అభినందిస్తున్న నిర్వాహకులు

చార్మినార్: పాతబస్తీ బేలా చందులాల్ ప్రాంతానికి చెందిన పాటిల్ విగ్నేష్ యాదవ్ ఒకవైపు విద్యాభ్యాసం కొనసాగిస్తునే.. మరోవైపు మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్‌లో రాణిస్తున్నాడు. చిన్నప్పటి నుంచి జిమ్నాస్టిక్స్, మార్షల్ ఆర్ట్స్ అంటే అతనికి ఎంతో ఇష్టమని చెబుతున్న పాటిల్ విగ్నేష్ యాదవ్ నగరంలో ఎక్కడ పోటీలు జరిగినా తప్పనిసరిగా పాల్గొంటూ తన ప్రతిభ కనబరుస్తున్నారు. తాను పాల్గొన్న పోటీల్లో విజేతగా నిలుస్తు పలువురి ప్రశంసలు పొందుతున్నారు. ఫెడరేషన్ ఆఫ్ మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్, ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు బెంగళూర్‌లో జరిగిన జూనియర్ బాయిస్, గర్ల్స్–సీనియర్ మెన్, ఉమెన్ నేషనల్ చాంపియన్‌షిప్–2024లో పాల్గొని గోల్డ్ మెడల్ సాధించారు. అండర్–12, మైనస్ 42 కేజీల విభాగంలో ప్రత్యర్థులను చిత్తు చేసి మొదటి స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ దక్కించు కున్నాడు. అలాగే డిసెంబర్ 6 నుంచి 11 వరకు జకర్తాలో జరిగే వరల్డ్ చాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొనడానికి అర్హత సాధించారు.

ఇప్పటికే జిమ్నాస్టిక్స్‌లో గోల్డ్ మెడల్..

ఇప్పటికే జీహెచ్‌ఎంసీ నిర్వహించిన జిమ్నాస్టిక్ పోటీలలో ప్రథమ స్థానంలో నిలిచిన పాటిల్ విగ్నేష్ యాదవ్ గోల్డ్ మెడల్ సాధించారు. ప్రస్తుతం మహేంద్రహిల్స్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో 4వ తరగతి చదువుతున్న విగ్నేష్ తన 4వ ఏట నుంచే జిమ్నాస్టిక్స్, మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్‌లో ప్రతిభ కనబరుస్తున్నారని భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ మాజీ చైర్మన్ పాటిల్ శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని పోటీల్లో పాల్గొని ఆశించిన ఫలితాలు సాధించాలని కోరుతున్నామన్నారు.

ప్రపంచ చాంపియన్‌షిప్‌లో విజయం సాధించాలనేదే ఆకాంక్ష...



మా నాన్న పర్యవేక్షణలో శిక్షణ పొందుతూ ప్రపంచ స్థాయిలో జకర్తాలలో జరుగనున్న పోటీలలో గోల్డ్ మెడల్ సాధించాలనేది నా కోరిక. జాతీయ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటా. ఇప్పటికే జరిగిన మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో విజయం సాధించా. అతి చిన్న వయస్సులో రెండు సార్లు గోల్డ్ మెడల్ సాధించడం పట్ల మా స్కూల్ ఉపాధ్యాయులతో పాటు కుటుంబసభ్యులు అభినందనలు తెలిపారు.
– పాటిల్ విగ్నేష్ యాదవ్